


## నెలనెలా నవ్వుల పండగ

## కామెడీ క్లబ్ కథలు

మల్లాది వెంకటకృష్ణమూర్తి

ఓ రష్యన్, ఓ అమెరికన్ , మన వెంగళ్రావ్ విమానప్రయాణంలో తారసపడ్డారు.

"అంతరిక్షంలో తొలిసారిగా అడుగుపెట్టింది మేమే!" గర్వంగా చెప్పాడా రష్యన్.

"చంద్రుడిమీద తొలిసారిగా కాలు పెట్టింది మేమే!" ఇంకా గర్వంగా చెప్పాడా అమెరికన్.

వాళ్ళిద్దరి మధ్యా కూర్చున్న వెంగళ్రావ్ చెప్పాడు

"సూర్యుడి మీద తొలిసారి కాలుపెట్టబోయేది మేమే!"

"సూర్యగోళం మీదకి ఎవరూ వెళ్ళలేరు. కాలి మసై పోతారు" చెప్పాడా రష్యన్.

"మేమేమైనా తెలివి తక్కువ వాళ్ళం అనుకుంటున్నావా? అక్కడికి రాత్రిపూటనే వెళ్తాం..!" గర్వంగా చెప్పాడు వెంగళ్రావ్!

# చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

**కిటికీ** దగ్గరగా పడుకున్న భార్యభర్తలకి ఏదో అలికిడైనట్టుగా వుంది.

భార్య: "దొంగేమోనండీ కిటికీ తలుపులు లాగడానికి ప్రయత్నిస్తున్నాడు"

భర్త: "మంచిదే! క్రితం ఏడాది వార్నిష్‌తో అంటుకుపోయిన తలుపులు ఈనాడైనా వాడి దయవల్ల తెరుచుకుంటే చేతులెత్తి దండం పెడదాం. గోలచేయకు పారిపోతాడు"

**"మనిషికి** ఇష్టమైన ఋతువులేవి? "

"వేసవిలో  చలికాలం, చలికాలంలో వేసవి. "

**తిండిపోతుల** పోటీ జరుగుతోంది. పోటీలో ఓ మహాకాయుడు 46 ఇడ్లీలు, 22 పెద్ద పెద్ద సమోసాలు, 8 పౌన్ల మాంసం కూర, 6 పెద్ద ఏపిల్ పళ్ళు భోంచేసి ఓ పది పింట్ల నీళ్ళు తాగాడు. పక్కనున్న ఆర్గనైజర్ని పిలిచి "ఏమయ్యా! మాకు కనీసం ఓ గంటన్నా విరామం వుండదా మధ్యలో?" అనడిగాడు.

ఆర్గనైజరు "ఎందుకండీ మీరిప్పటికే చాలా ముందున్నారు. మిగిలిన వాళ్ళు చిత్తయిపోతున్నారు మీ ముందు" అన్నాడు మెచ్చుకుంటూ.

"అదికాదయ్యా నేను ఎలాగైనా ఓసారి ఇంటికెళ్ళి రావాలి. భోజనానికి ఆలస్యంగా పోతే మా ఆవిడ మండిపడుతుంది" అన్నాడు కంగారుగా గడియారం చూసుకుంటూ.

**"ఈ భవంతి** 600 సంవత్సరాల క్రితం నాటిది. అయినా ఇంతవరకూ ఒక్క రాయిని కూడా కదల్చలేదు, రిపేర్లు చేయలేదు. ఎలా వున్నదలాగే వుంది" అని వర్ణించి చెపుతున్నాడో గైడ్ చూట్టానికి వచ్చిన వ్యక్తికి.

అతను "బహుశా మా ఇంటి యజమానిలాంటి వాడే అయి వుండుంటాడు ఈ భవంతి యజమాని పాపం" అని జాలిపడ్డాడు.

**ఎన్నికలొచ్చాయి.** పోటీకి నిలబడ్డ పాపాలరావు వేదిక ఎక్కి ఉపన్యాసం ఇస్తున్నాడు ఆవేశంగా "మా ప్రత్యర్థిపాలనలో మీకేం జరిగింది? పంచదార కేజీ ఐదు రూపాయలయింది."

సభికుల్లో ఒక్క మనిషి మాత్రమే ఆ మాటకి చప్పట్లు కొట్టాడు.

ప్రసంగం అయిపోగానే ఆ రాజకీయవాది చప్పట్లు కొట్టిన మనిషిని పిలిచి షేక్ హాండిచ్చి, "మీరు మా పార్టీకే మద్దతు ఇస్తున్నందుకు చాలా సంతోషం. కనీసం మీరయినా నాకు ఓటు వేస్తారని నమ్మకం కలిగింది" అన్నాడు.

చప్పట్లు కొట్టిన మనిషి "ఏమో నేను ఖచ్చితంగా చెప్పలేనండీ. నాకు షుగర్ కంప్లయింట్ వుంది గనక పంచదార వాడద్దన్నాడు డాక్టర్" తాపీగా అన్నాడతను.

**భార్యపోయిన** పదేళ్ళకి తన అరవయ్యో ఏట పాతికేళ్ళ అమ్మాయిని వివాహం చేసుకోదల్చాడు భుజంగరావు. ఆ సంగతి విని కలవరపడ్డ కొడుకు దగ్గరికొచ్చి "నాన్నా! పెళ్ళి చేసుకున్నాక, అనుకోనిదేదైనా జరిగితే..!?" నాన్నేశాడు.

"పోన్లేరా! మరో అమ్మాయి దొరక్కపోతుందా?"

**భార్య:** మీరు కుదిర్చిన పనిమనిషి చూపులూ, వరసా నాకేం నచ్చలేదు సుమండీ. మధ్యాహ్నం నుంచీ రావద్దని చెప్పేశాను.

భర్త: అయ్యో పోనీ దానికో అవకాశం ఇవ్వలేకపోయావూ.

భార్య: మీకో అవకాశం ఇవ్వటం ఇష్టంలేక మానిపించేసాను.

**మరణశయ్య** మీదున్న భార్య భర్తతో -

"నేను చచ్చిపోతే మీరు మళ్ళీ పెళ్ళి చేసుకోకండి. ఒకవేళ చేసుకున్నా ఆవిడకి నా చీరలు, నగలు మాత్రం ఇవ్వకండి."

భర్త: "సరేలే. అవెలాగూ ఆవిడకి సరిపోవు."

" **ఓ గడియారం** ప్రతి అరగంటకీ గంట కొట్టడమే గాక ప్రతి గంటకీ ఎన్ని గంటలయితే అన్ని గంటలు కొడుతుంది. ఓ పెద్దమనిషి ఇంట్లోకి ప్రవేశిస్తూనే గడియారం ఒక గంట కొట్టడం విన్నాడు. తర్వాత అరగంట అరగంటకీ వరసనే మూడు సార్లు ఒక గంటే వినిపించింది గడియారం. అంటే నాలుసార్లు వరసనే ఒక గంటే కొట్టింది. ఇదెలా సాధ్యం? - చెప్పరా రామూ"

"ఏముందండీ అతను మధ్యాహ్నం పన్నెండు గంటల్లో చివరి గంట కొట్టినపుడు ఇంట్లోకి వచ్చి ఉంటాడు. తర్వాత వరసనే 12.30కి, 1 గంటకి, 1.30కి గంటలు కొట్టింది."

COMMENTS